# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-04-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **బీసీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.**

3. **ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వినియోగంతో వివిధ శాఖల్లో ఆదాయం పెరుగుతోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.**

4. **రాజధాని అమరావతికి చట్టబద్ధత రావడంతో భూములు ఇచ్చేందుకు రాజధాని రైతుల నుంచి విశేష స్పందన వస్తుందని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు.**

5. **రాష్ట్రంలో న్యాయ శాఖను మరింత పటిష్టం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ న్యాయ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ తెలిపారు.**

=========================

బీసీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. బీసీల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం నాయకులు ముఖ్యమంత్రిని నిన్న కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వంతో చర్చించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని రంగాల్లో బీసీలకు పూర్తి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

-------------------------

రాష్ట్రంలో వివిధ సంస్థల పెట్టుబడి ప్రతిపాదనలకు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అదేవిధంగా పలు సంస్థలకు భూములు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న జరిగింది. ఈ సమావేశంలో మంత్రివర్గం ఉద్యోగుల బదిలీలకు ఆరు జోన్లు, రెండు మల్టీ జోన్ల విధానం, ప్రైవేటు విశ్వవిద్యాలయాల చట్టాన్ని సవరించేందుకు ఉన్నత విద్యాశాఖకు అనుమతి వంటి పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. పలు

పరిశ్రమలకు రాయితీల విషయంలో ఆయా సంస్థల ప్రతిపాదలను పరిశీలించిన మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంత్రివర్గ సమావేశం నిర్ణయాలను రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాత్రికేయులకు వివరిస్తూ...

వాయిస్..30 సెకన్లు

---------------------------

గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళం నియోజకవర్గం పరిధిలో రెండు కోట్ల రూపాలయతో నిర్మించిన బి.టి రోడ్డు, సిసి రోడ్డులను అయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. వాడాడ గ్రామ పంచాయితి పరిధిలో ఉన్న చెరువును పరిశీలించి రైతులకు ఉపయుక్తంగా మార్చనున్నట్లు పేర్కొన్నారు.

---------------------------

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఏఐ వినియోగంతో వివిధ శాఖల్లో ఆదాయం పెరుగుతోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. హైదరాబాదులోని సచివాలయంలో ఉపముఖ్యమంత్రి అధ్యక్షతన ఆదాయ వనరుల పెంపుపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశం నిన్న జరిగింది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఏఐ టెక్నాలజీ వినియోగంతో మైనింగ్, రవాణాశాఖల్లో ఆదాయ వనరులను పెంచుకోగలిగామని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క తెలిపారు. ఇసుక, క్రషర్ మైనింగ్ విభాగాల్లో అక్రమ రవాణా, ఓవర్‌లోడ్ వంటి అంశాల్లో చర్యలు చేపడితే ఆదాయం మరింత పెరుగుతుందని వివరించారు.

---------------------------

రాష్ట్రంలో న్యాయ శాఖను మరింత పటిష్టం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ న్యాయ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానంపై సమీక్షించేందుకు ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు వంగలపూడి అనిత, సత్య కుమార్ యాదవ్‌లు పాల్గొన్నారు. సమావేశం అనంతరం మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనవసర వ్యాజ్యాలను తగ్గించడం, కేసుల వేగవంతమైన పరిష్కారం, పారదర్శకత, జవాబుదారీతనం పెంపు కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు.

---------------------------

రాజధాని అమరావతికి చట్టబద్ధత రావడంతో భూములను ఇచ్చేందుకు రాజధాని రైతుల నుంచి విశేష స్పందన వస్తుందని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. భూములు ఇచ్చిన రైతులకు అన్ని మౌలిక వసతులతో కూడిన, అభివృద్ధి చేసిన ప్లాట్లను కేటాయిస్తామని స్పష్టం చేశారు. భూ సమీకరణకు తుళ్ళూరు మండలం పెదపరిమిలో ఒక్కరోజే వెయ్యి ఎకరాల భూమిని రైతులు మంత్రి సమక్షంలో నిన్న జరిగిన సమావేశంలో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

దీపం పథకం లబ్ధిదారులకు పైప్డ్ నేచురల్ గ్యాస్ – పీఎన్జీ వినియోగంపై అవగాహన కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. దీపం పథకం లబ్ధిదారులు పీఎన్జీకి మారితే... వారికి దీపం పథకం కింద ఇచ్చే రాయితీ సొమ్మును జమ చేసేందుకు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నామన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులు, చమురు సంస్థల ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పీఎన్జీ వినియోగం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గృహ అవసరాలకు సంబంధించి గ్యాస్ సరఫరాలో సమస్యలను అధిగమించామని ఈ సందర్భంగా అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

---------------------------

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార ఆవశ్యతకను వివరించడమే లక్ష్యంగా పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఒంగోలు సీడీపీఓ ఎం.కళ్యాణివర్మ తెలిపారు. పోషణ్ పక్వాడాలో భాగంగా ఒంగోలు విజయనగర్ కాలనీ అంగన్ వాడీ కేంద్రంలో ర్యాలీ, అవగాహన కార్యక్రమాలను నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత గర్భిణులు, బాలింతలు, చిన్నారులతో పౌష్టికాహారం గురించి అవగాహన కల్పిస్తూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీడీపీఓ కళ్యాణివర్మ బాలింతలు, గర్భిణులు, చిన్న పిల్లల తల్లులకు పౌష్టికాహార ఆవశ్యతకత, తీసుకోవాల్సిన విధానం, మంచి ఆహారపు అలవాట్ల గురించి వివరించారు.

---------------------------

వైద్య విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తున్నామని తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల ఆవరణలో 23 కోట్ల 75 లక్షల రూపాయల వ్యయంతో, 50 పడకల సామర్థ్యంతో అత్యాధునిక వసతులతో నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్, అత్యవసర సేవల విభాగాన్ని, తెలకపల్లి మండల కేంద్రంలో 1 కోటి 59 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన నిన్న ప్రారంభించారు.

---------------------------

ఒడిశా, దాని పరిసర ప్రాంతాలపై ఉన్న ఉపరితల ఆవర్తనం నుంచి తెలంగాణ, రాయలసీమ, అంతర తమిళనాడు మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఏర్పడిన ఉత్తర–దక్షిణ ద్రోణి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని అమరావతి వాతావరణం కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ..

వాయిస్..20 సెకన్లు

మరోవైపు తెలంగాణలో రానున్న 5 రోజుల పాటు పొడివాతావరణం ఏర్పడే అకాశం ఉందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. కొన్ని ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రత 41 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ వరకూ నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

====================